క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలలో నీటి వసతి



పాఠశాల ఆవరణలో తవ్వుతున్న బోరువెల్

సాక్షి ఎఫెక్ట్..

లింగాపూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో గత నెల 15న 'సాక్షి'లో సమస్యల్లో పాఠశాల.. తాగునీటి కోసం విద్యార్థుల ఇబ్బందులు అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆజ్మీరా శ్యాంనాయక్ స్పందించారు. పాఠశాల ఆవరణలో బోర్‌వెల్‌తో బోరింగ్ పాయింట్ వేశాడు. 'సాక్షి' కథనంతో పాఠశాలలో తాగునీటి సౌకర్యం రావడంపై విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి

లింగాపూర్: సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని పంచాయతీరాజ్ ఇంజినీర్ ఆడె ధర్మేందర్ అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల జాతీయ ఉపాధి హామీలో మంజూరైన రూ.కోటి 5లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. మండలంలోని దంపూర్, లోద్దిగుడా, ఏల్లాపటర్, గోపాల్‌పూర్, రాము నాయక్‌తండా, కొత్తపల్లి, పిక్లాతండా, మోతిపటార్, వంకామద్ది తదితర గ్రామాలను పరిశీలించామని తెలిపారు.


కూలీలకు పని కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

కౌటాల: ఉపాధి హామీ కూలీలకు వంద రోజుల పాటు పని కల్పించాలని ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులు మందకొడిగా సాగుతున్నాయని, కూలీలు పనులకు వచ్చేలా వసతులు కల్పించాలన్నారు. ఉపాధి కూలీలకు ప్రతి రోజు కూలీ రూ. 272 ఉందని, గ్రామాల్లో ఉపాధి పనులకు కూలీల సంఖ్యను పెంచాలన్నారు. ఈజీఎస్ సిబ్బంది పని ప్రదేశాలకు వెళ్లి పనుల కొలతలు చేపట్టాలని తెలిపారు. కూలీలకు పూర్తిస్థాయిలో కూలీ చెల్లించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో వందశాతం పన్నులు వసూలు చేయాలని తెలిపారు. వేసవిలో గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ నస్రుల్లా ఖాన్, ఏపీవో పూర్ణిమా, ఎంపీఓ మహేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కోనప్ప అభిమానుల సంబురాలు



సంబురాలు చేసుకుంటున్న అభిమానులు

కౌటాల: సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, అతడి సోదరుడు జిల్లా జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావుతో కలిసి హైదరాబాద్‌లో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. దీంతో మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తాలో కోనేరు అభిమానులు సాయంత్రం బాణసంచాలు కాల్చి సంబురాలు చేసుకున్నారు. బీఆర్ఎస్, బీఎస్పీ పార్టీల పొత్తును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోనేరు అభిమానులు ఆదే వసంత్ రావు, డొంగ్రే మధుకర్, మెర్పల్లి బ్రహ్మయ్య, రాందాస్, పోశం, ప్రభాకర్, రమేశ్, బాపు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

పాతమంచిర్యాల: 2024-25విద్యా సంవత్సరానికి ఉన్నత చదువుల కోసం అంబేద్కర్ విద్యానిధి పథకం కోసం జిల్లాలోని ఎస్సీ కులాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైన 4సంవత్సరాల డిగ్రీ కోర్సు చదివినా లేదా చివరి సంవత్సరం చదువుతున్న వారు ప్రభుత్వ సాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని, ఉన్నత చదువుల కోసం అమెరికా, ఇంగ్లాండ్, స్విట్జర్లాండ్, కెనెడా, న్యూజిలాండ్, సింగాపూర్, సౌత్‌కొరియా దేశాలలో ఉన్నత చదువుల కోసం వెళ్లవచ్చన్నారు. అర్హత ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వావ్.. ఖర్జెల్లి



ప్రాణహిత నదిలోని దిందా సమీపంలో చేపల వేట..



పూజలో వినియోగించే తీగదరి పూలు

- ఆకురాలే వేళ అడవిలో అందాలు
- విరగబూసిన మోదుగు పూలు



మోదుగుపూల చెట్టు



శిశిరంలో సాయంకాలం కనిపించే అరుణవర్ణపు సూరీడు

చింతలమానెపల్లి: తెలుగు కొత్త సంవత్సరాదికి స్వాగతం పలికే వేళ... శిశిర రుతువులో.. ఆకు రాలు వేళ.. ప్రకృతిలో అందాలు కొలువుదీరుతుంటాయి. ప్రత్యేకమైన వాతావరణం.. అటవీ ప్రాంతాలలో చోటుచేసుకునే మార్పులు.. కనులకు విందు చేస్తుంటాయి. ఆకులు రాలి మోడు వారే చెట్లు.. చిగురు తొడుగుతూ ఉంటే ఆకురాలే సమయంలోనే పూసే మోదుగు పూలో హోళి పండుగకు స్వాగతం పలుకుతూ ప్రత్యేకతను చాటుతాయి. మబ్బులు కనిపించని శిశిరంలో ప్రత్యేకంగా కనిపించే అరుణవర్ణపు భానుడి అందాలు చెట్ల కొమ్మల నుంచి అబ్బుర పరుస్తుంటాయి. వీటికితోడు ప్రాణహిత నదిలో చేపల వేట... చింతలమానెపల్లి మండలంలోని ఖర్జెల్లి అటవీ ప్రాంతంలో 'సాక్షి'కి చిక్కిన దృశ్యాలు..

బ్రహ్మోత్సవాలకు 'వెంకన్న' ముస్తాబు

సాక్షాత్తు తిరుపతి తిరుమల నుంచి ఆ ఏడుకొండల వాడు దిగిరానున్నాడు.. వారం రోజుల పాటు కెరమెరిలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు అందుకోనున్నాడు. ఇందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 8 నుంచి మహాశివ రాత్రిని పురస్కరించుకుని గోవిందుడి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలను కనుల పండువగా నిర్వహించేందుకు ఏర్పాట్లు భారీగా చేస్తున్నారు.

- 8 నుంచి స్వామివారి తిరునాళ్లు
- ఘనంగా పల్లకి ఊరేగింపు
- వారంరోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు
- భారీగా హాజరుకాకున్న భక్తులు



వేంకటేశ్వరస్వామి ఆలయం



గర్భగుడిలోని ప్రతిమలు



అలివేలు మంగ ఆలయం

కెరమెరి: బ్రహ్మోత్సవాలకు వెంకన్న ముస్తాబవుతున్నాడు.. ఆలయానికి అర్ధశతాబ్దం చరిత్ర ఉండడంతో ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మండల కేంద్రంలోని నెహ్రూనగర్‌లో శుక్రవారం నుంచి వేంకటేశ్వరస్వామి తిరునాళ్లు మొదలుకానున్నాయి. ఈసారి ఉత్సవాలు వినూత్నంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామి వారిని ప్రతిష్టంచి సుమారు 54ఏళ్లు కావస్తుంది. వేంటేశ్వరస్వామి ఆలయానికి ఆనుకునే అలివేలు మంగ ఆలయం సైతం ఉంది. ఈ నేపథ్యంలో గడిచిన 46ఏళ్లుగా వేంకటేశ్వరస్వామి పేరిట జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఏటా నిర్వహించే మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ ఉత్సవాలను ప్రారంభిస్తారు.

కథా నేపథ్యం ఇది..!

1970వ సంవత్సరంలో క్రితం నెహ్రూనగర్‌కి చెందిన తిమ్మయ్య పూజారి అనుక్షణం వేంకటేశ్వరస్వామి వారి ధ్యాసలో ఉండేవాడు. అతడికి రాత్రి కలలో శ్రీవారు దర్శనమిచ్చారు. తాను ఫలానా ప్రాంతంలో ఉన్నానని, వెంటనే అక్కడ తవ్వితే విగ్రహం లభిస్తుందని, దానిని ప్రతిష్టించి పూజలు చేస్తే సకల సంపదలతో పాటు ఊరు బాగుంటుందని చెప్పాడు. దీంతో అదే విషయాన్ని గ్రామ పెద్దలతో చెప్పి కలలో తెలిపిన ప్రాంతంలో తవ్వి చూడగా విగ్రహం లభించింది. దీంతో అదే చోట ఆలయం నిర్మించారు. నాటి నుంచి పన్నెండేళ్ల క్రితం వరకు తిమ్మయ్య అదే ఆలయంలో పూజారిగా సేవలు అందించాడు. భూత, భవిశ్యత్తులో జరిగే విషయాలను సైతం భక్తులకు వివరించేవాడు. 2003లో వృద్ధాప్యంతో స్వర్గస్తులయ్యారు. ప్రస్తుతం ఆయన తనయుడు లక్ష్మణ్ పూజారిగా సేవలందిస్తున్నాడు.

పల్లకి ఊరేగింపు..

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, బెంగుళూరు, వరంగల్, కరీంనగర్ తదితర జిల్లాలకు చెందిన భక్తులు తరలివస్తారు. 8వ తేదీ ఉదయం 11 గంటలకు స్వామివారి అఖండ దీపారాధన, పల్లకి ఊరేగింపు, మధ్యాహ్నం 2గంటలకు మహాపూజ నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

కెరమెరి జాతరను కుదించాలి



వినతిపత్రం ఇస్తున్న ఎంపీపీ, రాయిసెంటర్ సభ్యులు

కెరమెరి(ఆసిఫాబాద్): ఈ నెల 8న మహాశివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రారంభమయ్యే శ్రీవేంకటేశ్వరస్వామి జాతరను కుదించాలని మండలంలోని ఐదు రాయిసెంటర్ సభ్యులు బుధవారం ఆసిఫాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. గతంలో ప్రతి సంవత్సరం శివ రాత్రి ప్రారంభమైన నుంచి జాతర హోలి పర్వదినం వరకు ఉండేదని, దీంతో ఆదివాసీలు ఆర్థికంగా నష్టపోతున్నారని వివరించారు. దీంతో ఈ ఏడాది ఈ నెల 8 నుంచి 17 వరకు జాతర కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్‌ను తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెందోర్ మోతీరాం, రాయిసెంటర్ సభ్యులు ఆత్రం బొజ్జిరావు, రాయిసిడాం జంగు, నాయకులు ఆత్రం లక్ష్మణ్, మడావి రఘునాథ్, దుందేరావు, న్యానేశ్వర్ తదితరులున్నారు.

వేసవిలో నీటి కొరత లేకుండా చూడాలి

- సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాశ్ దేశ్‌పాండే

ఆసిఫాబాద్‌అర్బన్: వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో మండలంలోని గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ తెలిపారు. బుధవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఇప్పటి నుంచే అయా గ్రామాల్లో నీటి ఎద్దడిని గుర్తించి తగు చర్యలు చేపట్టాలని కార్యదర్శులకు సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పలు గ్రామాల్లో మిష న్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కావడం లేదని గుండి ఎంపీటీసీ మల్లికార్జున్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. గోవింద్‌పూర్ గ్రామపంచాయతీ ప్రజలు గుండి గ్రామానికి వెళ్లి రేషన్ సరుకులు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని గోవింద్‌పూర్‌లోనే రేషన్‌షాపు ఏర్పాటు చేయాలని, మన ఊరు మన బడి కింద చేపట్టిన పనులు అసంపూర్తిగా ఉన్నాయని ఎంపీటీసీ తెలిపారు. కుమురం భీం ప్రాజెక్ట్ కింద సాగునీరందడం లేదని ఎంపీపీ తెలిపారు. గిరి వికాసం కింద బోర్లు వేసుకున్నప్పటికీ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎంపీపీ తెలిపారు. డీఎల్పీవో ఒమర్ హు స్సేన్, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండే, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్ పాల్గొన్నారు.

నేడు బీటీ రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ

రెబ్బెన: మండలంలోని పలు గ్రామాలకు ఐటీడీఏ నిధులతో మంజూరైన బీటీ రోడ్ల నిర్మాణ పనులకు గురువారం ఎమ్మెల్యే కోవలక్ష్మి భూమిపూజ చేయనున్నట్లు ఏఈ బద్రోద్దీన్ తెలిపారు. మండలంలోని రాంపూర్ గ్రామానికి రూ.1.4 కోట్లు, కొత్త పులికుంట రూ.1.16 కోట్లు, రోళ్లపాడు రూ.80లక్షలు, పైకాజీగూడలకు ఐటీడీఏ ద్వారా నిధులు మంజూరైనట్లు తెలిపారు.

'కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం'



సమావేశంలో మాట్లాడుతున్న సుగుణక్క

లింగాపూర్: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నాయకురాలు సుగుణక్క అన్నారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నుంచి మొదటి మహిళా అభ్యర్థిగా ఆదరిస్తే లింగాపూర్ మండలంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో సునీల్ చవాన్, జాదవ్ రమేశ్, రాథోడ్ గోవింద్, బన్సీలాల్ ఉన్నారు.

రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్ ప్రారంభిస్తున్న ఎంపీపీ

సిర్పూర్(టి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన రైతు వేదికల్లో వీడియో కాన్ఫిరెన్స్ సౌలభ్యాన్ని బుధవారం సిర్పూర్(టి) ఎంపీపీ చునార్కర్ సువర్ణ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫిరెన్స్‌ను ప్రారంభించి వివరాలు వెల్లడించారు. రానున్న రోజుల్లో రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫిరెన్స్ రైతులు, వ్యవసాయ శాఖ అధికారులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారిణి మధులత, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం.. అస్తవ్యస్తం

- పెరుగుతున్న దోమలు
- దుర్గంధం వెదజల్లుతున్న కాలనీలు
- పంచాయతీలపై దృష్టి సారించని ప్రత్యేకాధికారులు



రోడ్డు పక్కనే నిలిచిన మురుగు

దహెగాం: పంచాయతీలలోని సర్పంచుల పదవీ కాలం ముగియడంతో ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం పంచాయతీలలో ప్రత్యేకాధికారులను నియమించింది. ప్రత్యేకాధికారులు పంచాయతీలను పట్టించుకోకపోవడంతో పారిశుధ్యం లోపిస్తుంది. పారిశుధ్యం లోపించకుండా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పారిశుధ్యం కార్యక్రమం నిర్వహించినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. దీంతో పారిశుధ్యంపై పట్టింపేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. అసలే వేసవి కాలం కావడంతో మురుగునీటితో దోమలు వృద్ధి చెంది ఇబ్బందులు పడుతున్నామని మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లోపిస్తున్న పారిశుధ్యం..

మండల కేంద్రంలో పలు వాడల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక పోవడంతో మురుగు రోడ్లపై పారుతోందని పలువురు వాపోతున్నారు. అదేవిధంగా మండలంలోని ఆయా గ్రామాల్లో సైతం మురుగు రోడ్లపై పారడం, నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెత్త సైతం ఎక్కడ పడితే అక్కడ పడేయడంతో దుర్గంధం వెదజల్లుతోందని పలువురు వాపోతున్నారు. దోమలు పెరిగిపోతుండడంతో రాత్రి వేళల్లో కరెంటు పోతే దోమలతో నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. దీంతో రోగాల బారిన పడాల్సి వస్తుందని భయాందోళన చెందుతున్నారు.

పట్టించుకోని ప్రత్యేకాధికారులు..

పంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించినా వారు గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించడం లేదన్న ఆరోపణలున్నాయి. గ్రామాల్లో పర్యటించక పోవడంతో పారిశుధ్యం లోపిస్తుందని, గ్రామాల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడంతో దుర్గంధం వెదజల్లుతోందని పలువురు వాపోతున్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు మంజూరు చేసి నిర్మిస్తున్నారు కాని డ్రైనేజీల నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదని వాపోతున్నారు. వర్షాకాలంలో మాత్రం రోడ్లన్నీ బురదగా మారుతున్నాయని వాపోతున్నారు. డ్రైనేజీల నిర్మాణం చేపడితే మురుగు రోడ్లపై రాకుండా ఉంటుందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి డ్రైనేజీలను నిర్మించాలని మండల వాసులు కోరుతున్నారు. పారిశుధ్య నిర్వహణపై సంబంధిత అధికారులను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

'బీఎస్పీతో పొత్తును వ్యతిరేకిస్తున్నాం'



బెజ్జూర్: మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు



సిర్పూర్(టి): మాట్లాడతున్న నాయకులు

బెజ్జూర్: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌తో బీఆర్ఎస్ పార్టీ కలవడాన్ని వ్యతిరేకిస్తున్నామని ఆ పార్టీ మండల నాయకులు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిర్పూర్‌లో కోనేరు కోనప్ప ఓటమికి కంకణం కట్టుకొని వచ్చిన వ్యక్తిని బీఆర్ఎస్‌తో కలుపుకోవడం ఏమిటని ప్రశ్నించారు. తమ మనోభావాలను దెబ్బతీసేలా పార్టీ అధిష్టానం వ్యవహరించడం సరికాదని, కోనప్ప నిర్ణయానికి కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. సమావేశంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సిడాం సకారాం, కోఆప్షన్ సభ్యుడు బషారత్ ఖాన్, మాజీ సర్పంచ్‌లు బుజాడి శేఖర్, కుమురం హన్మంత్, తలండి తిరుపతి, తొర్రెమ్ శంకర్, ఎంపీటీసీలు లంగారి శ్రీను, గురజాల వెంకటేశం పాల్గొన్నారు.

సిర్పూర్(టి): బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో బీఆర్ఎస్ పార్టీ పొత్తును వ్యతిరేకిస్తున్నామని సిర్పూర్(టి) మండల బీఆర్ఎస్ నాయకులు బుధవారం వెల్లడించారు. కోనేరు కోనప్ప గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలవ్వడానికి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కారణమని, అలాంటి వ్యక్తిని బీఆర్ఎస్ పార్టీ పొత్తు పెట్టుకోవడం సరికాదన్నారు. సమావేశంలో సిర్పూర్(టి) ఎంపీపీ చునార్కర్ సువర్ణ, మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్‌హుస్సేన్, ఎంపీటీసీ తుకారాం, మండల నాయకులు తోట మహేష్, దుర్గం విక్రమ్, దౌలత్, ఇఫాత్‌హుస్సేన్ ఉన్నారు.

ఎల్ఈడీ స్క్రీన్‌లో 'నారీశక్తి వందన్' వీక్షణ

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రేమలాగార్డెన్‌లో బుధవారం దేశ ప్రధాని నరేంద్రమోడీ పశ్చిమ బెంగాల్ నుంచి నిర్వహించిన బహిరంగ సభ నారీశక్తి వందన్ అభియాన్ కార్యక్రమాన్ని ఏపీఎం, గ్రూప్ అధ్యక్షుడు, సభ్యులు వీక్షించారు. కేంద్ర ప్రభుత్వం ఏ విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తుందో ప్రధాని లైవ్ ద్వారా వెల్లడించారు. ప్రధాని ప్రసంగాన్ని మహిళలు స్క్రీన్‌లో వీక్షించారు. ఈ కార్యక్రమంలో కోట్నాక విజయ్, ఖాంద్రె విశాల్, సొల్లు లక్ష్మి, కిరణ్, క్రిష్ణకుమార్, రాధిక, పెంటయ్య, సూర్యప్రకాష్, మురళీ, తదితరులు పాల్గొన్నారు.

కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడినట్లు ఎంపీడీవో పి.సత్యనారాయణ తెలిపారు. మండల సర్వసభ్య సమావేశం కొనసాగించే తేదీని ప్రకటిస్తామని తెలిపారు.